www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

SIDDIPET POWER
TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి: 01 సంచిక: 46 హైదరాబాద్ ఆదివారం 04-05-2025 పేజీలు: 04 ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## అధికారిపై దాడి.. భాజపా కార్పొరేటర్‌పై కేసు నమోదు



**సిద్దిపేట పవర్, తెలంగాణ బ్యూరో:**

భాజపాకి చెందిన కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్‌పై అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారిపై రాకేశ్ జైస్వాల్ దాడి చేయడంతో.. ఆయనపై బీఎన్ఎస్ యాక్ట్ 132, 352 కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించి, దాడికి పాల్పడ్డారని కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ స్పందించారు. అధికారులపై దాడులు చేస్తే సహించబోమన్నారు. అధికారులను పిలిచి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్‌పై కేసు నమోదు చేసినట్లు అబిడ్స్ పోలీసులు కమిషనర్‌కు వివరించారు.



## కేబినెట్ రేసులో విజయశాంతి

- పక్కా ఈక్వేషన్స్‌తో రాములమ్మ
- పట్టువదలకుండా ప్రయత్నాలు

**సిద్దిపేట పవర్, హైదరాబాద్(మే 03):**

తెలంగాణ క్యాబినేట్ విస్తరణ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ కోల్డ్ స్టోరేజీలో పెట్టినా..నేతల ప్రయత్నాలు మాత్రం ఆగడం లేదు. ఎవరికి వారు ఆ అమాత్య పదవి కోసం రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా చట్టసభల్లో అడుగు పెట్టిన నేతలు సైతం మంత్రి పదవి కోసం తెగ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పుడు తెంగాణ కాంగ్రెస్‌లో చర్చంతా తాజా ఎమ్మెల్సీ విజయశాంతి గురించే జరుగుతోంది. నెల రోజుల క్రితం పెద్దల సభ శాసనమండలిలో అడుగు పెట్టిన ఆమె..మంత్రి పదవిపై కన్నేశారన్న టాక్ విన్పిస్తోంది. ఎలాగైనా క్యాబినేట్లో స్థానం దక్కించుకోవాలని గట్టి పట్టుదలతో

మిగతా 2వ పేజీలో..

# పాక్ ఆర్థిక దిగ్బంధం!





- ఆర్థిక మూలాలపై దెబ్బ కొట్టేందుకు భారత్ ప్లాన్
- పాక్‌ను ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టులో తిరిగి చేర్చడంపై చర్చలు
- రుణాలు ఇవ్వకుండా ఆర్థిక సంస్థలపై ఒత్తిడికి వ్యూహం

**సిద్దిపేట పవర్, న్యూఢిల్లీ, (మే 03) :**

పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై దౌత్యపరమైన ఆంక్షలు విధించడమే కాకుండా దాయాది దేశాన్ని ఆర్థిక పరమైన చక్రవ్యూహంలో బంధించాలని భారత్ యోచిస్తోంది. సీమాంతర ఉగ్రవాదానికి పాల్పడే దేశాలపై ఆర్థికపరమైన ఆంక్షలను విధించే లక్ష్యంతో ఏర్పడిన ఆర్థిక కార్యాచరణ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) గ్రే లిస్టులో పాకిస్థాన్‌ను తిరిగి చేర్చాలని ఒత్తిడి తీసుకురావాలని భారత్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్‌పై రెండు రకాలుగా ఆర్థికపరమైన ప్రతీకార చర్యలు చేపట్టాలని భారత్ యోచిస్తోంది. అందులో మొదటిది పాకిస్థాన్‌ను మళ్లీ ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టులో చేర్పించేలా లాబీ చేయడం. దేశంలోని ఉగ్రవాద గ్రూపులకు సరిహద్దుల అవతల నుంచి అందుతున్న ఆర్థిక సహాయాన్ని అడ్డుకోవాలన్న విస్తృతమైన వ్యూహంలో భాగంగా ఈ చర్య చేపట్టాలన్నది భారత్ ఆలోచన.

ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టులో పాక్‌ను చేర్చాలన్న డిమాండును ముందుకు తీసుకెళ్లాలంటే తీసుకోవలసిన చర్యల గురించి ప్రభుత్వంలో చర్చ జరుగుతున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. పాకిస్థాన్ గతంలో 2018 జూన్ నుంచి 2022 అక్టోబర్ వరకు ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టులో ఉంది. గతంలో ఈ లిస్టులో ఉన్న రోజుల్లో దేశంలోకి అక్రమ నిధుల ప్రవాహం తగ్గిందని

మిగతా 2వ పేజీలో..



రహదారుల అభివృద్ధితోనే

## పెట్టుబడులు


- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**సిద్దిపేట పవర్, హైదరాబాద్(మే 03):**

రహదారులు అభివృద్ధి చెందినప్పుడే పెట్టుబడులు వస్తాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. భారత్ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం పదేళ్లుగా జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తోందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రహదారుల అనుసంధానం అన్నింటికంటే ముఖ్యమైనదని చెప్పారు. వాజ్ పేయి హయాంలో స్వర్ణ చతుర్భుజి పథకాన్ని తెచ్చారని, రోడ్ల నిర్మాణంపై లక్షల కోట్లు ఖర్చు ఎందుకని ఆనాడు కొందరు విమర్శించారని అన్నారు. మోడీ ప్రభుత్వం వచ్చాక రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేసిందని, కనెక్టివిటీ కోసం మోడీ ప్రభుత్వం ఎక్కువ నిధులు ఖర్చుపెడుతోందని పేర్కొన్నారు. పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్న అన్ని ప్రాంతాలకు రహదారులు నిర్మిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ శ్రీశైలం మధ్య ప్రయాణ సమయం తగ్గించేలా రోడ్లు నిర్మాణం జరుగుతుందని తెలియజేశారు. హైదరాబాద్ విజయవాడ మధ్య ఆరు లైన్ల రహదారికి యత్నిస్తున్నామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

మిగతా 2వ పేజీలో..

# అమరావతిపైనే బాబు కోటి ఆశలు



- రాజధాని కోసం ఎంత దూరమైనా ప్రయాణం
- నిర్మాణం పూర్తయితే.. పెట్టుబడుల వెల్లువ
- చేయిచాచనవసరం లేదన్న అభిప్రాయం
- సర్వశ్రేష్ఠ రాజధాని కోసం కలలు

**సిద్దిపేట పవర్, విజయవాడ, (మే 03):**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలల రాజధానికి మరి కొద్ది క్షణాల్లో శంకుస్థాపన జరగనుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఈ కార్యక్రమానికి వచ్చి మరీ పాల్గొంటున్నారు. ముందుగా సేకరించిన

మిగతా 2వ పేజీలో..



## ఇంకా చలామణిలోనే!

- కోట్లాది రూపాయల 2 వేల నోట్లు

**సిద్దిపేట పవర్, హైదరాబాద్(మే 03):**

దేశ వ్యాప్తంగా రూ.2 వేల నోట్లను ఉపసంహరించుకుని రెండేళ్లు అవుతున్నా రూ.6266 కోట్ల విలువైన నోట్లు ఇంకా చలామణీలో ఉన్నాయి. ఇప్పటివరకు 98.24శాతం నోట్లు వెనక్కి వచ్చాయని, మిగిలినవి రావాల్సి ఉన్నాయని ఆర్.బి.ఐ వెల్లడించింది. నోట్లను వెనక్కి తీసుకున్నప్పటికీ అవి లీగల్ టెండర్చె ల్లుబాటు గా కొనసాగుతాయని తెలిపింది. 19 ఆర్బిఐ ప్రాంతీయ కార్యాలయాల్లో డిపాజిట్ చేసే వెసులుబాటు కల్పిస్తోంది. అక్కడికి వెళ్లలేని వారు పోస్టాఫీసు సేవల్ని వినియోగించుకోవాలని సూచించింది.

మిగతా 2వ పేజీలో..

# 85 కి.మీ.కు మెట్రో డీపీఆర్ రెడీ



- జపాన్ తరహా ప్రణాళికలు
- కీలక అంశాలపై అధికారులు అధ్యయనం
- హైదరాబాద్ మెట్రోలో మరో కీలక మలుపు

**సిద్దిపేట పవర్, హైదరాబాద్(మే 03):**

హైదరాబాద్ మెట్రో రెండో దశ 'బి' భాగంగా జేబీఎస్ నుంచి మేడ్చల్ (24 కి.మీ.), జేబీఎస్ నుండి శామీర్‌పేట (21 కి.మీ.), శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీ (40 కి.మీ.) వరకు మూడు కీలకమైన మెట్రో మార్గాల సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) సిద్ధమైంది. ప్రస్తుతం హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ బోర్డు ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. ఆమోదం తర్వాత రాష్ట్ర మంత్రివర్గం చర్చించి కేంద్రానికి పంపుతుంది. జేబీఎస్ వద్ద ప్రపంచ స్థాయి మెట్రో హబ్‌ను అభివృద్ధి చేయాలని కూడా ప్రతిపాదన ఉంది.. దీని రూపకల్పన జపాన్‌లోని రవాణా వ్యవస్థను స్ఫూర్తిగా తీసుకుంటుంది. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్ట్ తన రెండో దశ విస్తరణకు వేగంగా అడుగులు వేస్తోంది. రెండో దశ 'బి'లో భాగంగా ప్రతిపాదించిన కీలకమైన మార్గాల సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) సిద్ధమైంది. ఈ డీపీఆర్‌ను హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ బోర్డు ఆమోదించాల్సి ఉంది. బోర్డు ఆమోదం తర్వాత.. రాష్ట్ర మంత్రివర్గం దీనిపై చర్చించి ఆమోదం తెలుపుతుంది. అనంతరం.. తుది అనుమతి కోసం డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వానికి పంపుతారు. రెండో దశ 'బి'లో హైదరాబాద్ నగరంలోని ఉత్తర ప్రాంతాలకు మెట్రో అనుసంధానాన్ని విస్తరించేందుకు ముఖ్యమైన ప్రతిపాదనలు ఉన్నాయి. ఇందులో జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్) నుంచి మేడ్చల్ వరకు 24 కిలోమీటర్ల మేర ఒక మార్గం, అలాగే జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు 21 కిలోమీటర్ల మేర మరొక మార్గం ప్రతిపాదించబడ్డాయి. వీటితో పాటు.. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీ వరకు దాదాపు 40 కిలోమీటర్ల పొడవైన మెట్రో మార్గం యొక్క డీపీఆర్‌ను కూడా సిద్ధం చేశారు.

విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీకి వెళ్లే మెట్రో మార్గం ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ నుంచి ప్రారంభమై.. కొత్తగా ప్రతిపాదించిన

మిగతా 2వ పేజీలో..

# సిటిజన్ కానిస్టేబుల్స్

- ఇకపై సాధారణ పౌరులకూ ఛాన్స్
- ఫోటోలు తీసి ఫిర్యాదు చేయొచ్చు

2







## తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకి ఫుట్ బాల్ ప్రోత్సాహక అవార్డు

**సిద్దిపేట పవర్, హైదరాబాద్(మే 03):**

అఖిల భారత ఫుట్ బాల్ సమాఖ్య (ఎఐఎఫ్ఎఫ్) వార్షిక అవార్డుల దినోత్సవం 02.05.2025 న భువనేశ్వర్ లో జరిగింది. 202425 సంవత్సరానికి గాను తెలంగాణలోని హైదరాబాద్లో ఫుట్ బాల్ ను ప్రోత్సహించడంలో, ప్రోత్సహించడంలో విశేష కృషి, సహకారం అందించినందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణను అఖిల భారత ఫుట్ బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) ఏఐఎఫ్ఎఫ్ వార్షిక అవార్డుల దినోత్సవం సందర్భంగా సత్కరించింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోనిబాలా దేవి ఐఎఫ్ఎస్ ఈ అవార్డును అందుకున్నారు.ఏఐఎఫ్ ఎఫ్ వార్షిక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఏఐఎఫ్ ఎఫ్

మిగతా 2వ పేజీలో..



## కర్రెగుట్టల్లో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్

**సిద్దిపేట పవర్, ములుగు(మే 03):**

కర్రెగుట్టల్లో ఆపరేషన్ కగార్ 12 వ కొనసాగింది. కేంద్ర బలగాలు కర్రెగుట్టలను ఆధీనంలోకి

మిగతా 2వ పేజీలో..

# 85 కి.మీ.కు మెట్రో డీపీఆర్ రెడీ

**మొదటిపేజీ తరువాయి**

మెట్రో రైలు డిపో పక్కనుంచి.. విమానాశ్రయ సరిహద్దు గోడ వెంబడి ఆకాశ మార్గంలోకొనసాగుతుంది. ఇది మాన్సాన్‌పల్లి, బహదూర్‌గూడ, పెద్ద గోల్కొండ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ఎగ్జిట్, తుక్కుగూడ ఎగ్జిట్, రావిర్యాల్ ఎగ్జిట్ వరకు సర్వీస్ రోడ్డులో వెళ్లేలా ప్రణాళిక రూపొందించారు. అక్కడి నుంచి ప్రభుత్వం కొత్తగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి ద్వారా కొంగర కలాన్, లేమూర్, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పంజగూడ , మీర్‌ఖాన్‌పేట వరకు దాదాపు 22 కిలోమీటర్ల మేర ఈ మార్గం విస్తరించనుంది. ఈ డీపీఆర్‌ను మొదట హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) బోర్డు ఆమోదించాలి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈ బోర్డుకు ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఇందులో ఎండీతో పాటు పురపాలక, పట్టణాభివృద్ధి, ఆర్థిక, పరిశ్రమలు, ఐటీ శాఖల కార్యదర్శులు, హెచ్ఎండీఏ కమిషనర్ డైరెక్టర్లుగా ఉంటారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు జేబీఎస్ వద్ద 30 ఎకరాల విస్తీర్ణంలో ప్రపంచ స్థాయి మెట్రో హబ్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రితో పాటు జపాన్ పర్యటనకు వెళ్లిన మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, అక్కడి అనుభవాలను ఈ మెట్రో హబ్‌లో పొందుపరిచేందుకు కృషి చేస్తున్నారు. జపాన్‌లో బుల్లెట్ రైళ్లు, మెట్రో , సాధారణ రైలు సదుపాయాలు ఒకదానితో మరొకటి అనుసంధానించబడి ఉంటాయి. ప్రయాణికులు ఒక రైలు నుండి మరొక రైలుకు సులభంగా మారేలా ఈ వ్యవస్థ రూపొందించబడింది. ఇదే తరహా అనుసంధాన వ్యవస్థను జేబీఎస్ మెట్రో హబ్‌లో కూడా ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు.



**వివరాలు పంపించండి... కిషన్ వినతి**

నగరంలో మెట్రోరైలు విస్తరణ కోసం వెంటనే ప్రతిపాదనలు పంపించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశించారు. కేంద్రమంత్రి ఆధ్వర్యం లో శుక్రవారం ఎంసీహెచ్ హెచ్ఆర్డీలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించారు. కేంద్రనిధులతో జరుగుతున్న కార్యక్రమాలపై కేంద్రమంత్రి ప్రత్యేకంగా సమీక్ష నిర్వ హించారు.మెట్రోరైలు ప్రాజెక్టులో అఫ్జల్‌గంజ్ వరకే పరిమితమైన ఫస్ట్ ఫేజ్ ను విస్తరించి.. సెకండ్, థర్డ్, ఫోర్త్ ఫేజ్‌ల కోసం ప్రతిపాదనలు వెంటనే కేంద్రప్రభుత్వానికి పంపించాలని సూచిస్తున్నట్లు తెలిపారు. మెట్రోరైలు వివరాలు అందితే కేంద్రప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు, రుణాలు లభించేలా సహకరిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో మొదట ప్రతిబింబించేది హైదరాబాద్ సిటీ అని.. అభివృద్ధి అంటే కేవలం హైటె క్ సిటీ కాదని.. ఓల్డ్ సిటీ, గౌలిగూడ, అంబర్‌పేట్, సనత్‌నగర్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ వంటి ప్రాంతాలూ కీలకమని అన్నారు. హైదరాబాద్ నగరం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, పాతబస్తీ ప్రాంతాల్లో మౌలిక వసతుల కొరత, ప్రాథమిక సౌకర్యాల సమస్యలు మరింతగా తలెత్తుతున్నాయని..హైటెక్ సిటీతో పాటు ఓల్డ్‌సిటీ అభివృద్ధిపై సమాన దృష్టితో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ సంస్థలు నగర మౌలిక వసతుల కల్పనలో కీలకపాత్ర పోషిస్తున్నాయని, నిధుల కొరత లేకుండా చూ సేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జీహెచ్ఎంసీ ఊహించని స్థాయి లో విస్తరిస్తూ జనాభా భారీగా పెరుగుతున్న నేపథ్యంలో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉందన్నారు. కేంద్రం ప్రవేశపెట్టే పథకాలకు రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను కేటాయించకపోవడం వల్లే నిధులు ఖర్చు చేయ లేని దుస్థితి ఏర్పడుతోందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. అధికారులు రాష్ట్రంలోని సమస్యలను తమ దృష్టి కి తీసుకువస్తే కేంద్రం నుంచి ఎన్ని నిధులైనా తీసుకువస్తామని తెలిపారు.



# కేబినెట్ రేసులో విజయశాంతి

**మొదటిపేజీ తరువాయి**

ఉన్నారట.తెలంగాణ కేబినెట్ లో ప్రస్తుతం సామాజిక సమీకరణాలు కొలిక్కి రాకపోవడంతో విస్తరణ అంశం వాయిదా పడింది.క్యాబినేట్ కూర్పులో ఖచ్చితంగా సామాజిక సమతుల్యం పాటించాలని పార్టీ హైకమాండ్ భావిస్తోంది. ఇదే అవకాశాన్ని అదునుగా భావిస్తున్న విజయశాంతి..అదే అస్త్రాన్ని సంధిస్తున్నారు.

తెలంగాణలో బీసీలలో బలమైన సామాజికవర్గమైన ముదిరాజ్ వర్గానికి క్యాబినేట్ ఛాన్స్ ఇవ్వాలని గట్టి పట్టుదలతో ఉన్నారు. భాగంగా అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్ ఒక్కరు మాత్రమే ఆ సామాజికవర్గానికి చెందిన వారు ఉన్నారు. క్యాబినేట్ విస్తరణ జరిగితే ఆయనకే పక్కా ఛాన్స్ అని అంతా భావించారు. కానీ ఇప్పుడు ఆల్ ఆఫ్ సడెన్గా రేసులోకి విజయశాంతి వచ్చారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ ఈక్వేషన్స్ తో పెద్దల సభలోకి విజయశాంతి అడుగుపెట్టారు. ఎమ్మెల్సీ అయినప్పటి నుంచి ఆమె క్యాబినేట్ లో చోటు కోసం కసరత్తు చేస్తున్నారు. అయితే అందుకోసం సామాజిక సమీకరణాల్లో భాగంగా విజయశాంతి కూడా ఇప్పుడు ముదిరాజ్ కోటాను ప్రస్తావిస్తోంది.చాలా కాలంగా రాజకీయాల్లో ఉంటున్నా.. ఇప్పటి వరకు ఏనాడు కూడా కులం అంశాన్ని ప్రస్తావించ లేదు. గతంలో మెదక్ నుంచి ఎంపీగా పోటీ చేసినప్పుడు కులం కాలమ్ లో ఏ కులం పేరును ప్రస్తావించలేదు. ఆ తర్వాత ఎప్పుడూ కూడా ఆమె ఏ సామాజికవర్గం అనేది స్పష్టత ఇవ్వలేదు. కానీ ఇప్పుడు ఆల్ ఆఫ్ సడెన్గా ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా విజయశాంతి బీసీ వర్గంగా చెప్పుకున్నారు. ఇందులో ముదిరాజ్ సామాజికవర్గంలో అంతర్భాగంగా ఉన్న ఓ వర్గం తనదంటూ..ఆ కోటాలో తనకు మంత్రివర్గంలో అవకాశం ఇవ్వాలని ఆమె కోరుతున్నారట.మొత్తం మీద తెలంగాణ రాజకీయాల్లో చాలా కాలంగా స్తబ్దుగా ఉన్న విజయశాంతి ఒక్కసారిగా ఎమ్మెల్సీ పదవితో యాక్టివ్ పాలిటిక్స్ లోకి వచ్చారు. ఇప్పుడు ఏకంగా ముదిరాజ్ కోటాలో మంత్రిపదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే విజయశాంతి చేస్తున్న ప్రయత్నాలు ఏమేరకు ఫలిస్తాయనేది వేచి చూడాలి. ఆమె కోరుతున్నట్లు మంత్రివర్గంలో ఛాన్స్ ఇస్తారా లేదా అన్నది రానున్న రోజుల్లో తేలిపోనుంది.




# తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకి ఫుట్ బాల్ ప్రోత్సాహక అవార్డు

**మొదటిపేజీ తరువాయి**


అధ్యక్షుడు కల్యాణ్ చౌబే, ఒడిశా గౌరవ ఉప ముఖ్యమంత్రి కనక్ వర్ధన్ సింగ్ దేవ్, ఒడియా భాషా సాహిత్యం, సాంస్కృతిక శాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్, ఐఏఎస్, ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి భాస్కర్ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఐఏఎస్, ఒడిశా ప్రభుత్వ క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి, ఇతర సభ్యులు అవార్డుల ప్రదానోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సోనీ బాలాదేవి, ఐఎఫ్ఎస్ మాట్లాడుతూ తెలంగాణ ఫుట్ బాల్ కు దక్కిన గౌరవం, రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని పెంపొందించడానికి తెలంగాణ క్రీడాకారులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఏఐఎఫ్ఎఫ్ కు తెలంగాణ ప్రభుత్వం తరపున వీసీ అండ్ ఎండీ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ కృతజ్ఞతలు తెలియజేశారు.

## కర్రెగుట్టల్లో కొనసాగుతున్న

# ఆపరేషన్ కగార్

**మొదటిపేజీ తరువాయి**

తీసుకుంటున్నాయి. ఇప్పటికే ధోబే, నీలంసరాయి కొండల్లో బేస్ క్యాంప్ల ఏర్పాటు చేసాయి. ఆధునిక డ్రోన్లతో మావోయిస్టుల కోసం గాలింపు కొనసాగుతోంది. డ్రోన్ల కోసం ప్రత్యేక సిగ్నలింగ్ టవర్ల ఏర్పాటు చేసారు. మావోయిస్టుల బంకర్లు గుర్తించేందుకు స్పెషల్ ఆపరేషన్ చేస్తున్నారు. ఆపరేషన్ కగార్తో తునికాకు సేకరణకు అంతరాయం కలిగింది. ఏజెన్సీ ప్రజలు అడవుల్లోకి వెళ్లేందుకు భయపడుతున్నారు.



# 10 శాతం భూమిని కబ్జా నుండి కాపాడండి

- **మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందించిన బాబు నాయక్**

**సిద్దిపేట పవర్,రంగారెడ్డి జిల్లాబ్యూరో(మే 03):**

కోట్ల రూపాయల విలువైన గ్రామపంచాయతీ చెందిన పల్లి శాతం భూమిని కబ్జాకోరులు ఆక్రమించారని, ఆ భూమిని స్వాధీనంలోకి తీసుకొని కబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ షాద్నగర్ మున్సిపల్ కమిషనర్ సునీతకు బాబునాయక్ అనే యువకుడు లిఖితపూర్వక ఫిర్యాదు చేశాడు. ఫరూక్ నగర్ మండలంలోని చటాన్ పల్లి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 649 లో వెంచర్ చేసిన సమయంలో గ్రామ పంచాయతీకి పది శాతం భూమి కింద 2004 సంవత్సరంలో రిజిస్టర్ డాక్యుమెంట్ నెంబర్ 7637/2004 ద్వారా గ్రామ పంచాయితీకి రిజిస్టర్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు పది శాతం భూమి విలువ ప్రస్తుతం మార్కెట్లో కోట్ల రూపాయలుగా ఉందని, పది శాతం భూమిని కొందరు కబ్జా చేసి ఆక్రమించినట్లు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ చెందిన 10% భూమిని కబ్జా నుండి కాపాడాలని చర్య తీసుకోవాలని కోరారు.





# సిటిజన్ కానిస్టేబుల్స్

**సిద్దిపేట పవర్, హైదరాబాద్(మే 03):**

రాంగ్‌రూట్‌లో వెళ్తే ట్రాఫిక్ పోలీస్ ఫోటో కొట్టి ఫైన్ వేయడం మనకు తెలిసిన విషయమే. అయితే ఎక్కడైనా ట్రాఫిక్ పోలీస్ లేడని తెలిస్తే మాత్రం వాహనదారులు మొత్తం ఇష్టం వచ్చినట్లు వెళ్తూ ఉంటారు. రాంగ్ రూట్‌లో వెళ్లి ప్రమాదాలకు కారణమైన వారిని మనం నిత్యం చూస్తూనే ఉంటాం. అందుకే ఇప్పుడు ట్రాఫిక్ పోలీసులు కొత్త రూల్ తీసుకువచ్చారు. రాంగ్ రూట్‌లో వెళ్తున్న వాహనదారులను ఎవరైనా ఫోటో తీసి పంపిస్తే.. అలాంటి వారికి జరిమానాలు వేసే నిర్ణయం తాజాగా అమల్లోకి వచ్చింది.హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ వాహనాలు పెరిగిపోతూనే ఉన్నాయి. అదే సమయంలో ట్రాఫిక్ కూడా నిత్యం పెరుగుతూనే ఉంది. ఇక ట్రాఫిక్ ఉల్లంఘించి వెళ్లే వాహనదారుల సంఖ్య కూడా అదే స్థాయిలో పెరుగుతోంది. దీంతో ఎక్కడికక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. మరోవైపు.. అందులో రాంగ్ రూట్ కారణంగా జరిగే ప్రమాదాలు, మరణాల సంఖ్య ఎక్కువగా ఉండటం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఈ నేపథ్యంలోనే సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు.. రాంగ్ రూట్‌లో వెళ్లే వాహనదారుల భరతం పట్టేందుకు సిద్ధం అయ్యారు. ఎవరైనా రాంగ్ రూట్‌లో వెళ్తే వారికి జేబులు చిల్లులు పడేలా ఫైన్లు వేస్తున్నారు. అయితే ఇదంతా ట్రాఫిక్ పోలీసులు ఉండే జంక్షన్ల మాత్రమే ఇప్పటివరకు ఉండేది. కానీ ఇక నుంచి సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇలాంటి రాంగ్ రూట్ డ్రైవింగ్ లేకుండా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.ఇందులో భాగంగానే ట్రాఫిక్ పోలీస్ లేని ప్రాంతాల్లో రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనదారుల ఫోటోలు తీసే అధికారాన్ని సాధారణ ప్రజలకు, వాహనదారులకు కల్పించారు. ఎవరైనా రాంగ్ రూట్‌లో వెళ్లినట్లు గమనిస్తే.. వారి వాహనం ఫోటో తీసి తమకు పంపిస్తే.. అలాంటి వారికి ఫైన్లు విధిస్తామని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కొత్త రూల్ తీసుకువచ్చారు. ఈ క్రమంలోనే సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక ఆసక్తికరమైన ట్వీట్ పెట్టారు. ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమించి రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనాల ఫోటోలు, వీడియోలు తీసి పంపాలని విజ్ఞప్తి చేశారు. అలాంటి ఫోటోలు వీడియోలను తమ వాట్సాప్ నెంబర్ 9490617346కు పంపించాలని.. వాటితోపాటు ఆ వాహనం లొకేషన్, టైమ్, డేట్ వంటి పూర్తి వివరాలను పంపించాలని ట్వీట్‌లో సూచించారు.పంపిన వివరాలను సేకరించి.. ట్రాఫిక్ నియమాలను అతిక్రమించి.. రాంగ్ రూట్‌లో వెళ్లిన వాహనదారులకు జరిమానాలు విధించి.. సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ముక్కుపిండి వసూలు చేయనున్నారు. మే 1వ తేదీ నుంచే ఈ కొత్త నిబంధన అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. రాంగ్ రూట్‌లో వాహనదారులు ప్రయాణాలు చేయకుండా ఉండేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తీసుకువచ్చిన ఈ రూల్‌కు సంబంధించిన ట్వీట్‌కు నెటిజన్లు మద్దతు తెలుపుతూ రీట్వీట్లు, కామెంట్లు చేస్తున్నారు.

# అమరావతిపైనే బాబు కోటి ఆశలు



**మొదటిపేజీ తరువాయి**

33 వేల ఎకరాలకు తోడు మరో 44 వేల ఎకరాలను సేకరించి దేశంలోనే అత్యుత్తమ రాజధానిగా చంద్రబాబు నాయుడు భావిస్తున్నారు. ఇందుకోసం ఎంతదూరమైనా వెళ్లేందుకు ఆయన సిద్ధపడుతున్నారు. విమర్శలను సయితం పక్కన పెట్టి రాజధాని నిర్మాణం పూర్తయితే వచ్చేకిక్కు కోసం ఆయన వెయిట్ చేస్తున్నారు. తాను హైదరాబాద్ లో సైబరాబాద్ ను డెవలప్ చేసినప్పుడు వచ్చిన ఇమేజ్ కు మించి అమరావతి నిర్మాణంతో రావాలని నాయుడుగారు భావిస్తున్నారు. అందుకోసం లక్షల కోట్ల రూపాయలను వెచ్చించడానికి సిద్ధపడుతున్నారు. తొలిదశలోనే దాదాపు నలభై మూడు వేల కోట్ల రూపాయల విలువైన పనులకు నేడు శంకుస్థాపన జరగుతుంది. ఇంకా రాజధాని ప్రాంతంలో నవనగరాల నిర్మాణంతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయం, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని నిర్మిస్తే చాలు ఇక తన జీవితం చరితార్థమవుతుందని ఆయన భావిస్తున్నారు. అందుకే వందలకోట్ల రూపాయలు వెచ్చించి ఇంత ఆర్భాటంగా చంద్రబాబు నాయుడుఅమరావతి రాజధాని పనులకు శంకుస్థాపన మళ్లీ చేయనున్నారు. దీనికి రీ లాంచింగ్ అని పేరు పెట్టినా అమరావతికి హైప్ తెచ్చేందుకే మరోసారి శంకుస్థాపనలు చేయిస్తున్నారన్నది వాస్తవం. . దాదాపు డెబ్బయి ఏడు ఎకరాలు ఒక్క రాజధానిలో ఉండటంతో పాటు విజయవాడ, గుంటూరు నగరాలను కలిపితే ఇక ఏపీకి తిరుగుండదని చంద్రబాబు అంచనా వేస్తున్నారు. అప్పుడు పెట్టుబడుల కోసం తాము కాళ్లరిగేలా తిరగాల్సిన పనిలేదని, వాటంతట అవే వచ్చిపడతాయన్న నమ్మకంతో ఏపీ సీఎం ఉన్నారు. మరోవైపు వీలయినంత త్వరగా కేంద్ర ప్రభుత్వ సంస్థలను కూడా ఏర్పాటు చేసే విధంగా సహకరించాలంటూ నేడు మోదీని చంద్రబాబు నాయుడు కోరనున్నారు. ఇప్పటకే కేంద్ర ప్రభుత్వ సంస్థలకు రాజధాని అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం భూములను కేటాయించింది.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దగ్గర నుంచి అనేక ప్రముఖ సంస్థలు ఇక్కడ తమ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కోరనున్నారు. దీంతో పాటు రైతులు ప్లాట్లుగా ఇచ్చిన భూమి పోగా ప్రభుత్వానికి భారీగా వేలాది ఎకరాలు మిగలనున్నాయి. ఈ మిగిలిపోయిన ఎకరాలను వేలం వేసినా రాజధాని నిర్మాణం కోసం చేసిన ఖర్చు వెనక్కు తిరిగి వస్తుందని చంద్రబాబు అంచనా. అందుకే తెగించి ఆయన ఈ నిర్ణయం తీసుకునట్లే కనపడుతుంది. వేగంగా రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేసిన తర్వాత తనకు ఇంకేమీ ఆశ మిగలదని సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలిసింది. అంటే ఆయన అమరావతి నిర్మాణాన్ని ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారో అర్థమవుతుంది. రాజధాని అమరావతి పూర్తయిన తర్వాత తనను తెగిడిన వాళ్లు కూడా ఖచ్చితంగా పొగుడ్తారని ముందుకు చంద్రబాబు అడుగులు వేస్తున్నారు. మరి ఏం జరుగుతుందన్నది తెలియాలంటే మరో మూడేళ్ల కాలం వెయిట్ చేయాల్సిందే.

# పాక్ ఆర్థిక దిగ్బంధం!

**మొదటిపేజీ తరువాయి**

భారత్ వాదిస్తోంది. ఇక రెండో చర్య పాకిస్థాన్‌కు రుణాలు అందచేస్తున్న బహుళ ఆర్థిక సంస్థలపై ఒత్తిడి తీసుకువచ్చి రుణాలు ఇవ్వకుండా అడ్డుకోవడం. అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకు, ఆసియన్ అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ)తోసహా ప్రధాన ఆర్థిక సంస్థలతో బహిరంగ చర్చలు ప్రారంభించాలని భారత్ భావిస్తున్నట్లు తెలుస్తుంది.పాకిస్థాన్‌కు అందచేస్తున్న ఆర్థిక సహాయాన్ని పునఃసమీక్షించాలని ఆయా ఆర్థిక సంస్థలను కోరాలని భారత్ భావిస్తోంది. సీమాంతర ఉగ్రవాదాన్ని అడ్డుకోవడంలో ఘోరంగా విఫలమైనప్పటికీ పాకిస్థాన్‌కు అభివృద్ధి సాయం కొనసాగడంపై భారత్ ఆందోళన వ్యక్తం చేయనున్నట్లు తెలుస్తుంది.

**రుణం అందకుండా ఒత్తిడి**

ఆర్థికంగా దివాలా తీసిన పాకిస్థాన్‌కు తిరిగి పట్టాలెక్కించడానికి ఐఎంఎఫ్ 700 కోట్ల డాలర్ల( భారతీయ కరెన్సీలో రూ.59,026 కోట్లు) రుణాన్ని అందచేస్తోంది. 2024 సెప్టెంబర్‌లో విడుదలైన ఈ రుణం విడతల వారీగా పాక్ అభివృద్ధి కోసం విడుదల చేస్తోంది. పాకిస్థాన్‌ను ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించడానికి 1958 నుంచి ఇప్పటివరకు 24సార్లు ఐఎంఎఫ్ రుణం అందచేసింది. సీమాంతర ఉగ్రవాదాన్ని నిరంతరాయంగా పెంచిపోషిస్తున్న పాకిస్థాన్‌కు ఈ తరహా ఆర్థిక సహాయం అందచేయడం లోని విశ్వసనీయతను, దూరదృష్టిని భారత్ ప్రశ్నించే అవకాశం ఉంది.ఇది గాక 4,340 కోట్ల డాలర్ల( రూ.1.13 లక్షల కోట్లు) రుణాన్ని 764 పబ్లిక్‌సెక్టార్ రుణాలు, గ్రాంట్ల కింద పాకిస్థాన్‌కు అందచేయడానికి ఆసియన్ అభివృద్ధి బ్యాంకు ముందుకువచ్చింది. వీటితోపాటు 365 ప్రాజెక్టుల కోసం 4,970 కోట్ల డాలర్ల రుణాన్ని(రూ.4.19 లక్షల కోట్లు) అందచేస్తామని ప్రపంచ బ్యాంకు పాకిస్థాన్‌కు వాగ్దానం చేసింది. ఈ ఆర్థిక సంస్థలపై ఒత్తిడి తీసుకువచ్చి పాకిస్థాన్‌కు రుణాలు ఇవ్వకుండా అడ్డుకోవాలని భారత్ యోచిస్తున్నట్లు ఆ అధికారి తెలిపారు.



## ఆంజనేయస్వామి దేవాలయంలో

# ఘనంగా పల్లకీ సేవ

**సిద్దిపేట పవర్, రంగారెడ్డి జిల్లా బ్యూరో (మే 03) :**

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ శ్రీరామ జయరామ, జయ జయ రామ నినాదాలతో ఆట పాటలతో, భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. భక్తి పాటలు భజనలతో ఆలయంలో శ్రీ రామ నామస్మరణ మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్ర చార్య, అర్చకులు కృష్ణ, ప్రమోద్, సునీల్ పంతులు ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పట్టణానికి చెందిన తిరుపతయ్య చారి, అనసూయ దంపతులు తమ కుమారుడు గన్నోజు వర్షిత్ జన్మదిన సందర్భంగా దేవాలయ అభివృద్ధికి రూ.2 వేల విరాళం అందజేశారు. అనంతరం భక్తులకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం గౌడ్, అన్నారం రఘు గౌడ్, జి.వసంతరావు, చేగురి రాఘవేందర్ గౌడ్, గడ్డమీద రమేష్ ముదిరాజ్, మంచిరేవుల అశోక్ శంకర్ గౌడ్, కిషన్ నాయక్, రాఘవేందర్, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, లక్ష్మికాంత్ రెడ్డి, కృష్ణ చారి, శంకరయ్య, వీఆర్వో బచ్చన్న, యాదగిరి, పి.ప్రవీణ్ గౌడ్, పద్మా వెంకటేష్, గోరియా నాయక్, కొత్త సత్తయ్య గౌడ్, శ్రీనివాస్, రమేష్, సుధాకర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, రవీందర్, మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య, భజన భక్త బృందం, మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.






## మొదటి స్థానం సాధించిన విద్యార్థిని సాన పూజితను సన్మానించిన ఉపాధ్యాయ బృందం

**తెలంగాణ. దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ ఏప్రిల్ మే03:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నీరుపేద విద్యార్థుల కోసం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు ఎర్పాటు చెయడంతో నిరుపేద విద్యార్థులు చదువుతున్న ఏన్సాన్ పల్లి పాఠశాలలో చదువుతున్న మిరుదొడ్డి గ్రామానికి చెందిన సాన యాదగిరి కూతురు సాన పూజిత ఆరువందల మార్కులకు గాను ఐదువందల ఆరవైఆరు మార్కులు సాదించి పాఠశాలలో మొదటి స్థానంలో రావడం చాలా సంతోషంగా ఉందని సాన యాదగిరి తెలిపారు. గురుకుల పాఠశాలలో మొదటి స్థానం రావడంతో ఉపాధ్యాయ బృందం మిరుదొడ్డి గ్రామానికి చేరుకొని పూజితను సన్మానించారు. తెలంగాణ గురుకుల పాఠశాలలో చదువుతున్న మిరుదొడ్డికి చెందిన సాన .పూజిత 600 మార్కుల కు 566 మార్కులు సాధించి ఆ స్కూల్ లో మొదటి స్థానంలో నిలిచినందుకు గురుకుల పాఠశాల ఉపాధ్యాయ బృందానికి పూజిత తల్లి తండ్రి కృతజ్ఞతలు తెలియజేశారు.సన్మానించిన వారిలో పాఠశాల ప్రిన్సిపాల్ విష్ణు వర్దన్ రెడ్డి, ఏటిపి రాధిక మేడమ్, మరియు ఇతర ఉపాధ్యాయ బృందం సన్మానించారు....

## బి ఆర్ఎస్ మత్తులో ఉన్న అధికారులకు త్వరలో వారిపై కఠిన చర్యలు!!



- ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవాలని చూస్తే సహించేది లేదు
- సిద్దిపేట పట్టణం లో అర్బన్ తాసిల్దార్ కార్యాలయం ను ఆకస్మికంగా సందర్శించిన సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ

**సిద్దిపేట పవర్:** సిద్దిపేట పట్టణం లో ఉన్న అర్బన్ మండలం MRO కార్యాలయం ను సందర్శించిన సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ.ఈ సందర్బంగా అర్బన్ మండలం MRO కార్యాలయం ను సందర్శించిన హరికృష్ణ అధికారులు సమయానికి వచ్చి వాళ్ళ విధులు సక్రమంగా నిర్వహించాలని, ప్రజల కు అధికారులు అందుబాటులో ఉండి వాళ్ళ సమస్యలు తొందరగా పరిష్కరించాలని, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని, ప్రభుత్వానికి చెడ్డ పేరే తెచ్చే విధంగా ప్రవర్తిస్తే వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకొంటుందని, నిజాయితీ గా పని చేసే అధికారుల కు ప్రభుత్వం అండగా ఉంటుందని, మాది ప్రజల ప్రభుత్వం అని.. ప్రజా ప్రభుత్వం అని రేవంత్ అన్న ప్రభుత్వం నిరుపేదల కోసం పని చేస్తుందని, కొందరు అధికారులు ఇప్పటికి BRS పార్టీ కి అనుకూలంగా పనిచేస్తున్నారని వారిపై ప్రభుత్వ చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే అధికారులు వారి సమస్యలు ఏమైనా ఉంటే నా దృష్టికి తీసుకొని వస్తే, మంత్రులకు గాని ముఖ్యమంత్రి దృష్టికి గాని తీసుకవెల్లి వారి సమస్య లు పరిష్కారం కోసం కృషి చేస్తానని అధికారులను కాపాడుకొనే భాద్యత ప్రభుత్వందే నని తెలిపారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాలీముద్దీన్, బొమ్మలు యాదగిరి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాహబ్, NSUI జిల్లా అధ్యక్షులు అజమాత్,వర్కింగ్ NSUI ప్రెసిడెంట్ రషద్,సాంబమూర్తి,తదితరులు మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు



# ప్రభుత్వాలు మారిన దివ్యాంగుల బతుకులు మారలేదు

- విద్యా, ఉద్యోగ అవకాశాల్లో 5 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి
- 6వేల పింఛన్ అమలు చేయాలి..
- ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ వికాస్ లో ప్రాధాన్యత కల్పించాలి
- తెలంగాణ దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డిమాండ్



**సిద్దిపేట, మే 3:**

సమాజంలో దివ్యాంగుల అంటేనే నేటికి చిన్న చూపనీ, దివ్యాంగుల బతుకులు గురించి ప్రభుత్వాలు మారిన బతుకులు మారలేదని తెలంగాణ దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు దండు శంకర్, చిట్యాల సంపత్ లు అవేదన వ్యక్తం చేశారు. శనివారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో జరిగిన సమావేశంలో లో వారు మాట్లాడుతూ వికలాంగుల పదాన్ని దివ్యాంగులుగా పదాన్ని మార్చి ప్రధాని మోదీ దివ్యాంగులకు ప్రత్యేకమైన విద్యా, ఉద్యోగాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. దేశంలో దివ్యాంగులు సకలాంగుల తో పాటు ఓటు హక్కు వినియోగించుకుని రాజకీయాలకు తోడ్పాటు అందిస్తున్నారన్నారు. 2016 చట్టం ప్రకారం సమాన హక్కులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం లేదన్నారు. 5 శాతం రిజర్వేషన్లు అన్ని అవకాశాల్లో కల్పించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు 6 వేల పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ వికాస్ ప్రాధాన్యత కల్పించాలన్నారు. విద్య, ఉద్యోగాల్లో 5 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2009 చట్టం ప్రకారం దివ్యాంగులకు విద్యను ఉచితంగా అందించాలని అన్నారు. అంత్యోదయ కార్డు, గ్రామీణ ఉపాధి హామీ పథకం లో జాబ్ కార్డు ఇచ్చి 150 పని దినాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ వ్యాపార దుకాణ సముదాయాల్లో దివ్యాంగులకు 5 శాతం కేటాయించాలి. బ్యాక్ లాగ్ ఉద్యోగాలు భర్తీ చేయాలి. స్వయం ఉపాధి కల్పన కోసం ఎలాంటి షరతులు లేకుండా బ్యాంక్ ద్వారా 10 లక్షల రూపాయలు వరకు రుణ సాయం అందించాలని కోరారు. నకిలీ వికలాంగులను తొలగించి అర్హులైన దివ్యాంగులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో టి జి డి జెఎసి నాయకులు క్రమశిక్షణ విభాగం కన్వీనర్ అరుగొండ మల్లేశం, మహిళా విభాగం అధ్యక్షులురాలు లావుడ్య సరిత, సురేష్, గౌరవ సలహాదారులు శ్రీశైలం, పిడిశెట్టి నారాయణ, పిల్లి అంజయ్య దుర్గయ్య, బాబు, ముక్కపల్లి కనకరాజు పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష నిర్వహణ కేంద్రాలను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ గరీమా అగ్రవాల్

**సిద్దిపేట పవర్:**

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల లో ఏర్పాటు చేసిన యూజీ నీట్ 2025 పరీక్ష నిర్వహణ కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ గరీమా అగ్రవాల్ శనివారం పరిశీలించారు. పరీక్ష రాసే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయాలని, విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే పరీక్ష హాల్లోకి అనుమతించాలని, పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులతో సహా ఎవరు ఎలక్ట్రానిక్ పరికరాలను, మొబైల్ ఫోన్లను తీసుకు వెళ్ళవద్దని, అన్ని పనులను నిబంధన ప్రకారం చేయాలని అధికారులను ఆదేశించారు.

విద్యార్థులు హాల్ టికెట్, 1 పాస్పోర్ట్ సైజ్ ఫోటో, 1 పోస్ట్ కార్డ్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డ్ / పాన్ కార్డ్ తదితర ఏదేని ఒక గుర్తింపు కార్డును వెంట తీసుకొని రావాలని ఎలక్ట్రానిక్ వస్తువుల ను పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించారని అన్నారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని విద్యార్థులను ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే అనుమతించడం జరుగుతుందని, సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని పరీక్ష రాసే విద్యార్థులకు సూచించారు. అదనపు కలెక్టర్ వెంట అడిషనల్ డిసిపి సుభాష్ చంద్రబోస్, నీట్ పరీక్ష సిటీ కోఆర్డినేటర్ సూర్య ప్రకాష్, తాసిల్దార్ సలీం, పరీక్ష నిర్వహణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.






## రైతులకు ధాన్యం పేమెంట్ వెంటనే పడేలా చూడండి: మంత్రి పొన్నం!!

**సిద్దిపేట పవర్:** కోహెడ మండలం శనిగరం గ్రామంలో అధునాతన పాడి క్లీనర్ అండ్ డ్రయ్యర్ యంత్రాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్.. అనంతరం ఐకేపీ కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు పై వివరాలు అడిగి తెలుసుకున్నారు.. ధాన్యం తరలింపు వాహనాల ఇబ్బంది లేకుండా చూసుకోవాలని , రైతులకు ధాన్యం పేమెంట్ వెంట వెంటనే పడేలా జాగ్రత చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన మంత్రి పొన్నం ప్రభాకర్ తేమ శాతం మంచిగా ఉంటే త్వరగా ధాన్యం కొనుగోలు జరగాలనికొనుగోలు కేంద్రం నిర్వహిస్తున్న మహిళా సంఘాలకు ధన్యవాదాలు తెలిపారు.



## రంగనాయక సాగర్లో ఈతకెళ్లి ఇద్దరు మృతి

**సిద్దిపేట పవర్:** సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రంగనాయక శాఖలో సెల్ఫీ మోజులో ఇద్దరు మృతి చెందడం జరిగిందని జిల్లా ఫైర్ అధికారి సదన్ తెలిపారు. సెల్ఫీల కోసం ఎవరు నీటిలోకి దిగవద్దని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. రంగనాయక సాగర్ చూడడానికి పర్యటకులు రావడం జరుగుతుందని వారు అన్నారు.

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రంగనాయక సాగర్ రిజర్వాయర్ లో పడి ఇద్దరు మృతి చెందడంతో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. రంగనాయక సాగర్ రిజర్వాయర్ చూడనీకి వచ్చిన వరంగల్ కు చెందిన రెండు కుటుంబాలకు చెందిన దాదాపు 13 మంది సందర్శనకు రావడం జరిగింది. ప్రమాదవశాత్తు రిజర్వాయర్లో పడి ఇద్దరు పిల్లలు మృతులు మిరాజ్ 15 యువతి, అర్బాస్ 15 సంవత్సరాలు మృతి చెందారు. వెంటనే సంఘటన స్థలానికి చిన్నకోడూరు పోలీసులు, ఫైర్ సిబ్బంది చేరుకొని గజ ఈతగాల్ల సాయంతో మృతదేహాలను వెలికి తీశారు.





## వైభవంగా ఎల్లమ్మ ఆలయ పూజారి కూతురి వివాహం

**సిద్దిపేట పవర్:**

సిద్దిపేట ఎల్లమ్మ దేవాలయం పంతులు కిషోర్ కూతురి పెళ్లి వైభవంగా జరిగింది. ఈ వివాహానికి మంత్రి పొన్నం ప్రభాకర్, సిద్దిపేట జిల్లా ఆర్టీఏ ( రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ ) మెంబెర్ ,సిద్దిపేట జిల్లా ఓబీసీ సెల్ అద్యక్షులు డాక్టర్ సూర్య వర్మ, కాంగ్రెస్ నాయకులు పయ్యావుల ఎల్లం యాదవ్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. మంత్రి వెంట కాంగ్రెస్ నాయకులు పూజల హరి కృష్ణ తదితరులు ఉన్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన గరీమా అగ్రవాల్

**సిద్దిపేట పవర్:** సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) గరీమా అగ్రవాల్ సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. వరిధాన్యం సేకరణను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్, తేమ శాతం కొలిచే యంత్రాల పని తీరును పరిశీలించారు. రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు చేయడానికి పట్టే సమయం గురించి అడిగి తెలుసుకున్నారు.




WWW.SIDDIPETPOWER.COM

# సిద్ధిపేట మున్సిపల్ అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి .

- మాజీ చైర్మన్ రాజనర్సు భారీ అవినీతికి పాల్పడుతున్నారు
- వెనక ఉంది నడిపిస్తున్నది రాజనర్సు టీమ్ కౌన్సిలర్లు
- మునిసిపల్ లో చేసిన అవినీతి నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమా.
- పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్ .




**సిద్ధిపేట పవర్;**

సిద్ధిపేట మునిసిపల్ ఆఫీసులో భారీ అవినీతికి పాల్పడుతున్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలి అని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్ మునిసిపల్ కమీషనర్ అశ్రిత్ కుమార్ ను డిమాండ్ చేశారు. సిద్ధిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్ గారు మాట్లాడుతూ సిద్ధిపేట మునిసిపల్ లో కొందరు అధికారులు అవినీతికి పాల్పడుతున్నారు అని అన్నారు. అవినీతికి పాల్పడుతున్న పై స్థాయి అధికారులు చర్య తీసుకోవడంలో విఫలం అవుతున్నారు అని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లో ఎంత అవినీతి చేసినా పట్టించుకునే వారు కాదని కాంగ్రెస్ ప్రభుత్వం లో అవినీతికి పాల్పడకుండా ప్రజా పాలన అందించడమే లక్ష్యంగా పనిచేయాలి అని అన్నారు. మునిసిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు భారీ అవినీతికి పాల్పడుతున్నారు అని అవినీతికి పాల్పడుతూ కొందరు అధికారులు కూడా అదే రీతిలో తయారు అయ్యారని అన్నారు. కొంతమంది కౌన్సిలర్లు అధికారులు తప్పు చేసిన వెనుక వేసుకోస్తున్నారని అన్నారు. అలాంటి వారిపై పోలీసులు సుమోటో కింద కేసు నమోదు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలి అని అన్నారు. రాజనర్స్ చేస్తున్న అవినీతిపై తమ వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయి అని రాజనర్స్ మునిసిపల్ లో చేసిన అవినీతి నిరూపిస్తే ఆయన భార్య మంజుల రాజీనామాకు సిద్ధమా సవాల్ విసిరారు. దోచుకొని దాచుకోవడానికి బీ ఆర్ఎస్ పార్టీ పుట్టింది అని 10 సంవత్సరాలుగా రాష్ట్రాన్ని కలవకుట్ల కుటుంబం దోచుకుతిన్నది అని అన్నారు. మీరు చేసిన అవినీతిని ప్రజల ముందు త్వరలోనే బయటపెడుతా అని అన్నారు. సిద్ధిపేట లో జరుగుతున్న అవినీతిపై ఎసిబి అధికారులను త్వరలోనే కలిసి సిద్ధిపేట మున్సిపల్ అవినీతిపై ఫైల్ అందజేస్తా అని అన్నారు. సిద్ధిపేట లో అభివృద్ధి పేరిట అందినంతవరకు బిఆర్ఎస్ నాయకులు దోచుకుంటున్నారు అని ఈ విషయాన్ని ప్రజలు గమనించాలి అని అన్నారు. రాబోయే రోజుల్లో అవినీతికి పాల్పడినవారు తగిన మూల్యం చెల్లించుకుంటారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధిపేట అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వహాబ్ ఎన్ ఎస్ యు ఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రాషాడ్. సంతోష. నజ్జు వంశీ తదితరులు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

జీవితంలో ఏది కోల్పోయినా పరవాలేదు కానీ,ఇంకొకరి కోసం మనల్నీ మనం కోల్పోకూడదు ఎందుకంటే..మన ఇష్టాఇష్టాలు కష్టనష్టాలు ఏంటి అనేది..మనకి మాత్రమే తెలుసు కాబట్టి..

ఇంకొకరి కోసం మనల్ని మనం వదిలేస్తే చివరికి మన గమ్యం ఏంటనేది మనకే తెలియకుండా పోతుంది..జీవితంలోఎవరు ఎవరికి శాశ్వతము కాదు..ఎవరి మీద అంత ఆధారపడకుండా..ఎవరి మీదా నమ్మకం పెట్టుకోకుండా..మన కాళ్ళ మీద మనం నిలబడాలి..

మన జీవితం మనకు నచ్చినట్టుగా జీవించాలి.. ఎదుటివారికి నచ్చినట్టు బతకడం నేర్చుకుంటే.. నటించడం నేర్చుకోవలసి వస్తుంది.

ప్రతీ పరిచయం..రుణానుబంధం లాంటివి..రుణం తిరిపోగానే వెళ్ళిపోతాయ్..ఏ పరిచయం అయిన శాశ్వతం కాదు..మద్యలో వస్తాయి మద్యలోనే వెళ్లిపోతాయి..

మనల్ని అర్ధం చేసుకునే వాళ్ళు ఎపుడూ మనతోనే ఉంటారు..వాళ్ళు మనతో ఉండడానికి నిరాకారించరంటే ఋణానుబంధం ముగిసినట్టే కాబట్టి ఎప్పడూ మనల్ని మనం నమ్ముకోవాలి.

జీవితాన్ని ఎలా మొదలు పెట్టావు అనే దానికంటే ఎలా ముగించావు అనేదే చాల ముఖ్యం.

మనిషి పుట్టినప్పుడు ప్రేమగా ఎత్తుకోవడానికి ఎంతమంది ఉన్నా..మనిషి చనిపోయినప్పడు మనస్ఫూర్తిగా కన్నీళ్ళు కారుస్తూ ఎత్తే నలుగురు మనుషులను సంపాదించుకో..

అది లేనప్పడు నువ్వేంత పెద్ద హోదా పదవిలో ఉన్నా,నీ దగ్గర ఎంత ఆస్థిపాస్తులున్నా అది వ్యర్థమే.

సదా మీ శ్రేయోభిలాషి..
జర్నలిస్టు గణేష్ బాబు..






## బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

**జనం తోడు, సిద్ధిపేట అర్బన్:** అనారోగ్యంతో మరణించిన ఏఆర్ కానిస్టేబుల్ డివిఆర్ రాజు, కుటుంబానికి పోలీస్ డిపార్ట్మెంట్ భద్రత నుండి వచ్చిన 8 లక్షల రూపాయల చెక్కును కుటుంబ సభ్యులకు పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ అందజేశారు. పోలీస్ కుటుంబాలకు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అండగా భద్రత స్కీమ్ ఉపయోగపడుతోందన్నారు. విధినిర్వహణలో మృతిచెందిన పోలీసులకు డిపార్ట్మెంట్ ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. 2024 డిసెంబర్ నెలలో అనారోగ్యంతో మరణించిన ఏఆర్ కానిస్టేబుల్ డివిఆర్ రాజు కుటుంబ సభ్యులకు పోలీస్ డిపార్ట్మెంట్ తరపున అందవలసిన బెనిఫిట్స్ లో భాగంగా పోలీస్ డిపార్ట్మెంట్ భద్రత నుండి వచ్చిన 8 లక్షలు చెక్కులను కుటుంబ సభ్యులకు అందజేశారు. తదనంతరం వాళ్ళ కుటుంబ ఆర్థిక పరిస్థితి తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. వచ్చిన ప్రతి పైసను జాగ్రత్తగా పిల్లల పేరుపై ఫిక్స్ డిపాజిట్ చేయాలని సూచించారు. విధినిర్వహణలో మృతి చెందిన పోలీస్ కుటుంబ సభ్యులకు డిపార్ట్మెంట్ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు.రాజు కుటుంబ సభ్యులకు రావలసిన మరికొన్ని బెనిఫిట్స్ త్వరలో అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ ఏసీపి రవీందర్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీధర్ గౌడ్, బి సూపరింటెంట్ అలీషా పలుషా నిమ్మల, రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి జూనియర్ అసిస్టెంట్ రవిరాజు, తదితరులు పాల్గొన్నారు.




## మతం పేరుతో మారణహోమం సృష్టిస్తే సహించం

**రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

**సిద్ధిపేట పవర్;**

మతం పేరుతో మారణహోమం సృష్టిస్తే సహించబోమని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హెచ్చరించారు. చేర్యాల మండలం లోని వెచగిరి గ్రామం ఎల్లాదాస్ నగర్ కు చెందిన దళిత యువకుడు అజయ్ ను కట్టెసి కొట్టి బట్టలు ఉప్పి ఊరేగించిన సంఘటన పై శనివారంనాడు విచారణ జరిపారు. ఈ సందర్భంగా అజయ్ పై దాడి వివరాలను ప్రజల నుండి అడిగి తెలుసుకున్నారు. వెరె గ్రామానికి చెందిన బిజెపి,విహెచ్ పి,భజరంగ్ దళ్ నాయకులు అజయ్ పై దాడి చెసి జై శ్రీ రామ్ అంటు నినాదాలు చేస్తు బట్టలు విప్పి దాడి చెశారని వివరించారు.నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని దాడి చెస్తే సహించమన్నారు. ఇటివల కాలంలో కులం, మతం పేరుతో ఎస్సీ ఎస్టీ ల పై దాడులు చెస్తున్నారన్నారు.ఎస్సీ, ఎస్టీ లకు కమిషన్ అండగా వుంటదని భరోసా కల్పించారు. అజయ్ పై దాడి చేసిన నిందితులందరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసులు నమోదు చేయాలని పోలీస్ కమిషనర్,ఎసిపి లను ఆదేశించారు. డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ దళితుల జోలికి వస్తే చూస్తూ ఉరుకొబొమని హెచ్చరించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని దళిత,ప్రజా సంఘాల నాయకులు కొరారు. ఈ కార్యక్రమం లో వివిధ సంఘాల నాయకులు అభినయ్,శ్రీ కాంత్,,బుడ్డి సత్యనారాయణ, ప్రసాద్,పులి కల్పన,నరెష్, పులి కల్పన,ఎగొండ, వెణు,రాజలింగం,భైరి వెంకటెశం,శేఖర్ తదితరులు పాల్గొన్నారు



## సంగారెడ్డి జిల్లాలో తాగునీటి కోసం జనం తిప్పలు.. మిషన్ భగీరథ నిర్వహణ లోపంతో ఇక్కట్లు



**సంగారెడ్డి మే 3(సిద్ధిపేట పవర్ ) :** వేసవి తాపానికి తోడు తాగునీటికష్టాలతో సంగారెడ్డి జిల్లా వాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఓవైపు ఎండలు మండుతుంటే మరోవైపు గుక్కెడు నీటి కోసం ప్రజలు తిప్పలు పడాల్సివస్తోంది. మిషన్ భగీరథ పథకం నిర్వహణ లోపం ప్రజలకు శాపంగా మారుతుంది. మిషన్‌భగీరథ నిర్వహణ లోపం కారణంగా నారాయణఖేడ్, సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్ నియోజకవర్గాల్లోని గ్రామాలు, తండాల్లోని ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సివస్తోంది.

నారాయణఖేడ్ నియోజకవర్గంలోని పలు గ్రామాలు, తండాలకు రెండురోజులకు ఒకమారు తాగునీరు సరఫరా అవుతుంది. దీంతో ప్రజలు, తండావాసులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిషన్‌భగీరథ ద్వారా తాగునీరు సరఫరా కానిరోజు ప్రజలు వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తుంది. అయితే జిల్లాలో భూగర్భ జలమట్టాలు వేగంగా పడిపోతున్నాయి. జిల్లాలో 15.47 మీటర్ల లోతుకు భూగర్భజలమట్టాలు చేరుకున్నాయి. కంగ్టి మండలంలో అత్యధికంగా 27 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. దీంతో నారాయణఖేడ్ ప్రాంతంలో భూగర్భజలమట్టాలు తగ్గి వ్యవసాయబోర్లు, తాగునీటిబోర్లు సైతం ఎండిపోతున్నాయి. దీంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సివస్తుంది.

**నారాయణఖేడ్‌లో నీటి తిప్పలు అధికం**

జిల్లాలో నారాయణఖేడ్ నియోజకవర్గంలోని ప్రజలు ఎక్కువగా నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రజలు దాహార్తి తీరేలా మిషన్‌భగీరథ ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్‌లు ఇచ్చారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మిషన్‌భగీరథ పథకాన్ని సక్రమంగా నిర్వహించకపోవడంతో నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రజలు నీటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. కరెంటు కోతలకు తోడు మిషన్‌భగీరథ పైప్‌లైన్‌లు తరచూ పగిలిపోవటంతోపాటు లీకేజీలు అవుతున్నాయి. మిషన్ భగీరథ సిబ్బంది వెంటనే స్పందించి మరమ్మతులు చేయకపోవటంతో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

నారాయణఖేడ్ పట్టణంలోని పలు వార్డులతో పాటు కంగ్టి, నాగల్‌గిద్ద, సిర్గాపూర్, కల్హేర్ మండలాల్లోని పలు గ్రామాలకు మిషన్‌భగీరథ నీళ్లు రెండురోజులకు ఒకమారు సరఫరా అవుతున్నాయి. నాగల్‌గిద్ద మండలంలోని కుబ్బాతండా, గంగారం తండా, ఇరక్‌పల్లి తండాతోపాటు చుట్టుపక్కల ఉన్న పది తండాలకు రెండు రోజులకు ఒకమారు తాగునీరు సరఫరా అవుతుంది. దీంతో ప్రజలు తాగునీటికోసం ఇబ్బందులు పడుతున్నారు. తండాల్లోని బోరుబావుల నుంచి నీళ్లు రాకపోవటంతో గిరిజనులు వ్యవసాయక్షేత్రాల్లోని బోరుబావుల నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారు.



## ఘనంగా పెద్దమ్మతల్లి వార్షికోత్సవ వేడుకలు

**సిద్ధిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి మే: 03**

సిద్ధిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం తిర్మలపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ మహోత్సవంలో భాగంగా శనివారం నాడు పెద్దమ్మ తల్లి కి బోనాలు సమర్పించి పెద్దమ్మతల్లిపెద్దిరాజు కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. గ్రామదేవతలకు పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పురోహితులు శస్తుల్లా రాజేశ్వర్ శర్మ, గ్రామ ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ అమ్మ దయ ఉంటే అంతా మంచి జరుగుతుందని గ్రామదేవతలకు పూజలు నిర్వహించి, పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగిందని, గ్రామస్థులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని గ్రామం సుభిక్షంగా ఉండాలని, సమయానికి వర్షాలు కురిసి పండిన పంటలకు గిట్టుబాటు ధర రావాలని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని గ్రామదేవతలని వేడుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శివంది లక్ష్మి నారాయణ లలిత దంపతులు, ఉపాధ్యక్షుడు గడ్డం స్వామి, కార్యదర్శి గడ్డం లక్ష్మీ నారాయణ, కోశాధికారి కొండెయ్యళ్ల భిక్షపతి, డైరెక్టర్ లు కొండెయ్యళ్ల వజ్రమ్మ, గడ్డం స్వామి, గడ్డమీది కుమార్, గడ్డమీదు స్వామీ, చుట్టాకుల శ్రీను, తిర్మలపూర్ గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## హరిరామ్ ఆస్తులపై ఆరా తీస్తున్న ఏసీబీ..



**సిద్ధిపేట పవర్, సిద్ధిపేట అర్బన్:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో గజ్వేల్ ఈఎన్‌సి హరిరామ్ ఏసీబి కస్టడి కొనసాగుతోంది. ఇప్పటికే హరిరామ్ ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈఎన్‌సీ హరిరామ్ ను ఐదు రోజుల పాటు కస్టడీకి అనుమతిచ్చింది కోర్టు. శుక్రవారం హరిరామ్ ను చంచల్‌గూడ జైలు నుంచి ఏసీబి కస్టడులోకి తీసుకుంది. ఏసీబీ ప్రధాన కార్యాలయంలో హరిరామ్ ఆస్తులపై ఏసీబీ ఆరా తీస్తోంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 13 కోట్ల రూపాయల ఆస్తులను గుర్తించింది ఏసీబి. బహిరంగ మార్కెట్ వీటి విలువ పదిరెట్లు. వంద కోట్లకు పైగా హరిరామ్ ఆస్తులను గుర్తించింది ఏసీబి.

మంగళవారం వరకు హరిరామ్ ను ఏసీబి విచారించనున్నది. కస్టడీలో భాగంగా హరి రామ్ కు చెందిన లాకర్లను ఓపెన్ చేయనున్నది ఏసీబి. లాకర్లు ఓపెన్ చేస్తే హరీ రామ్ ఆస్తుల విలువ పెరిగే అవకాశం ఉందంటున్నారు అధికారులు. ఇంత భారీ స్థాయిలో ఆస్తులను కూడా పెట్టిన హరిరామ్ వెనకాల ఉన్నది ఎవరు అన్న కోణంలోనూ విచారిస్తోంది ఏసీబీ. హరి రామ్ ఇంట్లో సోదాల సమయంలో స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్ల వివరాలు సేకరిస్తోంది. స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్ల పై ఉన్న పేర్లు, వారితో ఉన్న సంబంధాలు పై ఆరా తీస్తున్నారు అధికారులు. హరిరామ్ కు పలువురు బినామీలు ఉన్నట్లుగా గుర్తించారు. బ్యాంకు అకౌంట్లు, డాక్యుమెంట్ల, బినామీలతో ఉన్న ఆస్తులు వివరాలను రాబట్టనున్నారు.



## పుష్కల్ అగ్రోటెక్ లిమిటెడ్ స్టోర్ ప్రారంభం

**సిద్ధిపేట పవర్‌గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి మే: 03**

సిద్ధిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ లో జగదేవపూర్ వెళ్లే రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన శివశక్తి గ్రూప్ కంపెనీ వారి పుష్కల్ ఆగ్రో టెక్ లిమిటెడ్ స్టోర్ శనివారం నాడు ఎండి హరీశ్ బాబు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా స్థిరపడాలని ఉద్దేశంతో శివశక్తి గ్రూప్ కంపెనీ వారి పుష్కల్ ఆగ్రోటెక్ లిమిటెడ్ స్టోర్ ప్రజ్ఞాపూర్ లో నూతనంగా ప్రారంభించడం జరిగిందని, ఆర్గానిక్ మందులు, పెస్ట్ సైడ్ సీడ్స్, విత్తనాలు సరసమైన ధరలకు నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు అమ్మడం జరుగుతుందని అన్నారు. కంపెనీ నుండి డైరెక్ట్ స్టాక్ కు డీలర్లు లేకుండా ఫెస్టి సీడ్స్ రావడంతో అందరికంటే దాదాపు 25 శాతం ధరలు తక్కువకు మా వద్ద అన్ని రకాల పురుగు మందులు, విత్తనాలు, లభించే అవకాశం ఉందని ఈ అవకాశాన్ని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మరియు పరిసర ప్రాంత రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అనూక్ బాబు, సురేష్, జైల్ శర్మ, సురేందర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.